క్లుప్తంగా

కూటమికి వణుకు పుడుతోంది

వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్

లబ్బీపేట(విజయవాడతూర్పు): పార్లమెంటు సభ్యుడు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అరెస్టు రాజకీయ కక్ష సాధింపేనని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ అన్నారు. ఆయన ఆదివారం విజయవాడలో మీడియాతో మాట్లాడారు. పెద్దిరెడ్డి కుటుంబాన్ని, వైఎస్సార్ సీపీని ఇబ్బంది పెట్టడమే కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. అందులో భాగంగానే అక్రమ కేసులు, లేని లిక్కర్ స్కామ్‌ను సృష్టించి అరెస్ట్‌లు చేస్తోందని విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో అమలు చేస్తున్న రెడ్ బుక్ రాజ్యాంగాన్ని రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఈ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. పెద్దిరెడ్డి కుటుంబ సభ్యులక, వైఎస్సార్ సీపీ నాయకులకు పార్టీ పూర్తిగా అండగా ఉంటుందన్నారు. చంద్రబాబు ప్రభుత్వం కేవలం వైఎస్సార్ సీపీ నాయకులపై కక్షలు తీర్చుకోవడానికే అధికారంలోకి వచ్చినట్లు ఉందన్నారు. ఈ 13 నెలల్లో వైఎస్సార్‌సీపీ చేస్తున్న ప్రజా పోరాటాలు చూసి కూటమి ప్రభుత్వ నాయకులకు భయం పట్టుకుందన్నారు. లిక్కర్ స్కామ్‌లో ఎలాంటి ఆధారాలు లేకుండా అక్రమంగా అరెస్టులు చేస్తున్నారని దేవినేని అవినాష్ పేర్కొన్నారు. కేవలం ముగ్గురు ఉద్యోగులను బెదిరించి కట్టు కథలు అల్లి కుట్రపూరితంగా కేసులు పెట్టారన్నారు. చంద్రబాబు అతని మీడియా కలిసి డ్రామా చేస్తున్నారని మండిపడ్డారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పక్కన ఉండే బలమైన వ్యక్తుల మీద కక్ష తీర్చుకోవడానికే అక్రమ కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ఎన్ని కుట్రలు పన్నితే, వైఎస్సార్ సీపీ అంతగా బలపడుతుందన్నారు. అధికారం శాశ్వతం కాదని, వచ్చేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని తేల్చిచెప్పారు.

డాన్స్ కాంపిటేషన్ పోస్టర్ ఆవిష్కరణ



భవానీపురం(విజయవాడపశ్చిమ): సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం, స్వచ్ఛ విజయవాడ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి అవగాహన పెంచేందుకు డాన్స్ కాంపిటేషన్ నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. భవానీపురంలోని హరిత బెరంపార్క్‌లో ఆదివారం సాయంత్రం డాన్స్ కాంపిటీషన్స్‌కు సంబంధించిన పోస్టర్‌ను రిలీజ్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 27న హరిత బెరంపార్క్‌లో డాన్స్ పోటీలు ప్రారంభం కానున్నట్లు పేర్కొన్నారు. అన్ని రకాల వయసుల వారికి వివిధ కేటగిరీలు ఉంటాయని చెప్పారు. మొదటి కేటగిరిలో 6 ఏళ్ల కంటే తక్కువ వయసు, 7 నుంచి10 ఏళ్ల వయసుగల వారు రెండో కేటగిరి, 11 నుంచి 15 ఏళ్ల వయసుగలవారు మూడో కేటగిరి, 16 ఏళ్ల వయసుపైబడినవారు నాలుగో కేటగిరిలో డాన్స్ పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆసక్తిగల వారు విజయవాడ నగరపాలక సంస్థ సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన దానిలో ఉన్న రిజిస్ట్రేషన్ లింక్‌ను క్లిక్ చేసి వివరాలతో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ కె.చైతన్య, పశ్చిమ తహసీల్దార్ షేక్ ఇంతియాజ్, నగరపాలక సంస్థ వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ డి.సోమశేఖరరెడ్డి, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

పశ్చిమంలో ప్రతి చోటా దుర్వాసనే

- అల్లాడుతున్న స్థానికులు
- చెత్త తరలించకపోవటంతో పేరుకుపోయిన వైనం
- సమ్మె కారణంగా ఎక్కడి చెత్త అక్కడే
- కొండ ప్రాంతాల్లో దారుణ పరిస్థితులు



సుబ్బరామయ్యవీధిలో పేరుకుపోయిన చెత్త కుప్పలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పశ్చిమ నియోజకవర్గంలో ఎక్కడ చూసినా చెత్త నుంచి వస్తున్న దుర్వాసనతో ప్రజలు అల్లాడుతున్నారు. నియోజకవర్గంలోని చెత్త తరలింపు స్తంభించటంతో ఏ వీధి చూసినా భారీగా చెత్తే దర్శనమిస్తోంది. నగర పాలక సంస్థ సిబ్బంది సమ్మెకు దిగటంతో అందులోనూ ఆదివారం కావటంతో పరిస్థితి దారుణంగా మారింది. నియోజకవర్గంలోని చెత్త కుప్పల్లో భారీగా చెత్త పేరుకుపోవటంతో స్థానిక ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వివిధ మార్కెట్ల పరిసర ప్రాంతాల్లో వ్యాపారుల నుంచి వచ్చే చెత్తను డంప్ చేయటంతో భారీగా చెత్త పేరుకుపోయి స్థానికులను తీవ్ర అవస్థలకు గురి చేస్తుంది. నియోజకజవర్గంలో సగానికి పైగా డివిజన్లు కొండ ప్రాంతాల్లోనే ఉన్నాయి. లక్షకు పైగా జనం కొండ ప్రాంతాల్లోనే నివసిస్తున్నారు. అటువంటి ప్రాంతాల్లో చెత్త తరలింపునకు విఘాతం కలగటంతో ఎక్కడ చెత్త అక్కడే దర్శనమిస్తుంది. ప్రధానంగా మల్లికార్జునపేట, కొత్తపేట, గొల్లంపాలెంగట్టు, ఆంజనేయవాగు వంటి ప్రాంతాల్లోని కొండపై భాగాల్లో చెత్త భారీగా పేరుకుపోయింది. దీంతో స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక అధికారులు దీనిపై దృష్టి పెట్టకపోవటంపై ఆందోళన చెందుతున్నారు.

వ్యాధులు ప్రబలుతాయని ఆందోళన

చెత్త భారీగా పేరుకుపోవటంతో పాటుగా వర్షాలు పడుతుండటంతో ఎక్కడ ఎటువంటి వ్యాధులు ప్రబలుతాయనని జనం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అసలే సీజన్ మారుతున్న నేపథ్యంలో పలువురు జ్వరాలతో ఇబ్బందులు పడుతున్నారు. దానికి తోడు చెత్త కుప్పలు భారీగా ఉండటంతో వ్యాధులు విజృంభించే ప్రమాదం ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలోనూ జ్వరాలు, డయేరియా, మలేరియా, టైఫాయిడ్ వంటి వాటితో ప్రజలు నానా అవస్థలు పడ్డారు. స్థానిక ప్రజాప్రతినిధులతో పాటుగా అధికారులు స్పందించాలని డిమాండ్ చేస్తున్నారు.

దుర్గమ్మ ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న వెలంపల్లి శ్రీనివాసరావు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): అమ్మవారిని తమ ఇంటి ఆడపడుచుగా భావించి భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో సారె సమర్పిస్తారని, దుర్గమ్మ ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు తెలిపారు. 48వ డివిజన్ పరిధిలోని పలువురు వైఎస్సార్ సీపీ నేతల ఆధ్వర్యంలో ఆదివారం అమ్మవారికి ఆషాఢ సారెను సమర్పించారు. డివిజన్ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు పిళ్ల సూరిబాబు(జగ్గు) నివాసానికి వెలంపల్లి శ్రీనివాసరావు విచ్చేసి అమ్మవారికి పూజలు నిర్వహించారు. వాగు సెంటర్‌లోని దుక్క హరిభాస్కర్ నివాసంలో అమ్మవారి ఆషాడ సారె సమర్పణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ అమ్మవారికి సారె ఇవ్వడం వల్ల ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆరోగ్యంగా ఉంటామనే నమ్మకమన్నారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని కోరుకుంటున్నానన్నారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, అమ్మవారి భక్తులు పాల్గొన్నారు.

భ్రమరాంభ అమ్మవారికి ఆషాఢ సారె సమర్పణ



రావిచెట్టు సెంటర్ నుంచి సారె తీసుకెళుతున్న మహిళలతో మేయర్ భాగ్యలక్ష్మి

భవానీపురం(విజయవాడపశ్చిమ): పశ్చిమ నియోజకవర్గం వన్‌టౌన్‌లోని భ్రమరాంభ మల్లేశ్వర స్వామివార్ల (పాత శివాలయం) దేవస్థానంలో కొలువై ఉన్న భ్రమరాంభ అమ్మవారికి ధర్మకర్తల మండలి చైర్మన్ బొమ్ము మధు నేతృత్వంలో ఆషాఢ సారె సమర్పించారు. ఆదివారం విద్యాధరపురం రావిచెట్టు సెంటర్‌లోని గంగానమ్మ గుడి వద్ద నుంచి పలువురు మహిళలు పసుపు, కుంకుమ, గాజులు, రకరకాల స్వీట్స్ తదితర సారె సామగ్రిని తీసుకొని కాలి నడకన బయలుదేరి పాత శివాలయానికి చేరుకున్నారు. అక్కడ భ్రమరాంభ అమ్మవారికి సారె సమర్పించి తమ సంకల్పాలను విన్నవించుకున్నారు. స్థానిక మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి పాల్గొని సారెతో కూడిన మహిళలను సాగనంపారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్మన్ బొమ్ము మధు, సభ్యులు నాగోతి గురురామ్ ప్రసాద్, రాంపిళ్లవాసు, తాతపూడి చంద్రశేఖర్, నాగోతి విజయనిర్మల, కామినేని కోమల, వేలాది శాంతి, ఏనుగుల దుర్గాభవానీ, జూలూరు సౌజన్య శ్రీలక్ష్మి, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

వైభవంగా కావడి మహోత్సవం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సుబ్రహ్మణ్యేశ్వర సేవా సమితి (తమిళ సంఘం) ఆధ్వర్యంలో విమాన కావడి మహోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. విమాన కావడి మహోత్సవంలో భాగంగా సుబ్రహ్మణ్యేశ్వరుని భక్తులు నిర్వహించిన వివిధ రకాల పూజలలు ఒళ్లు గగుర్పాటు కలిగించాయి. వీపుకు కొక్కెలను దించుకొని తాడుపై వేళాడుతూ నిర్వహించిన విమానకావడి భక్తులను తన్మయుల్ని చేసింది. వన్‌టౌన్‌లోని స్థానిక పాడివీధిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తమిళ భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామికి పూజలు నిర్వహించారు. ముగ్గురు యువకులకు వారి శరీరంలోని వీపు భాగానికి కొక్కెలను గుచ్చి, వారిని గాలిలో వేళాడే విధంగా తాడుతో కట్టి క్రేన్ సాయంతో భూమికి 20 అడుగుల ఎత్తులో 50 అడుగుల మధ్య ప్రయాణం చేస్తూ షణ్ముఖునికి పూజ నిర్వహించారు. ఈ విమానకావడిలో మూడు పర్యాయాలు భక్తులు వెనుకకు ముందుకు వెళ్లి వస్తారు. అందులో యువకులు తాడుకు తమ వీపు భాగంలోని ఇనుప కొక్కెలను కట్టించుకొని స్వామికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తొలిసారి దండ వేసి పూజ చేయడం, రెండోసారి కొబ్బరి కాయ కొట్టి హారతి ఇవ్వడం, మూడో సారి నిమ్మకాయలను మంత్రించి భక్తులపైకి విసరడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో తమిళ భక్తులు పన్నీరుకావడి, పాల కావడి, పుష్పకావడి తదితర మొక్కులను స్వామికి సమర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఊరేగింపు పాడివీధిలో ప్రారంభమై ఇంద్రకీలాద్రిపై వేంచేసి ఉన్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానానికి చేరుకొని భక్తులు మొక్కులు చెల్లించారు. సమితి నిర్వాహకులు మాట్లాడుతూ సుమారు 50 సంవత్సరాలుగా తమ సేవా సమితి ఆధ్వర్యంలో ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. స్వామి వారి అనుగ్రహంతోనే ఏటా విమానకావడి మహోత్సవాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు వివరించారు.

శ్రావణంలో నిత్య కుంకుమార్చన

చిట్టినగర్: 25వ తేదీ నుంచి ప్రారంభమయ్యే శ్రావణ మాసంలో నిత్యం కొత్త అమ్మవారికి కుంకుమార్చనలు జరుగుతాయని ఆలయ కార్యదర్శి మరుపిళ్ళ హనుమంతరావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు తెలిపారు. ఆగస్టు 23వ తేదీ వరకు శ్రావణ మాసోత్సవాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అమ్మవారికి నిత్య అలంకరణ, పౌర్ణమి రోజున అభిషేకం, 5వ శుక్రవారమైన 22వ తేదీ లక్ష కుంకుమార్చన, పుష్పయాగం నిర్వహించేందుకు ఆలయ అర్చకులు ఏర్పాట్లు చేస్తున్నారన్నారు.

మొల్ల రామాయణ పద్య కావ్యం అజరామరం



మొల్ల విగ్రహాన్ని ఆవిష్కరించిన ఐలాపురం వెంకయ్య



విగ్రహావిష్కరణలో డీసీపీ సరిత, ఈశ్వర్ తదితరులు

మొల్ల విగ్రహాన్ని ఆవిష్కరించిన ఐలాపురం వెంకయ్య

భవానీపురం(విజయవాడపశ్చిమ): సహజ పాండిత్యంతో మొల్లమాంబ రచించిన మొల్ల రామాయణం పద్య కావ్యం చరిత్రలో అజరామరంగా నిలిచిపోయిందని మాజీ శాసనమండలి సభ్యులు ఐలాపురం వెంకయ్య తెలిపారు. విద్యాధరపురం శాలివాహన సంఘం ఆధ్వర్యంలో స్థానిక రామమందిరం సెంటర్‌లో ఏర్పాటు చేసిన రచయిత్రి, కవి ఆతుకూరి మొల్లమాంబ విగ్రహాన్ని ఆదివారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ తమ కుల ఆడపడుచు మొల్లమాంబ విగ్రహాన్ని ఆవిష్కరించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. మొల్లమాంబ తన రచన ద్వారా తెలుగు కుటుంబాన్ని రామాయణానికి అన్వయించారని చెప్పారు. అందులోని భాష తెలుగుదనంతో నిండి ఉంటుందని తెలిపారు. తెలుగు కావ్య క్షేత్రంలో తొలి పద్య కవయిత్రి ఆతుకూరి మొల్ల అన్నారు. విజయవాడ డీసీపీ (అడ్మిన్) కేజీవీ సరిత మాట్లాడుతూ భారతీయ సంస్కృతికి, ధార్మిక జీవన విధానానికి దర్పణంగా నిలిచిన వాల్మీకి విరచితమైన శ్రీమద్రామాయణాన్ని ఆధారంగా చేసుకుని తేట తెనుగులో రాయబడిన పద్యకావ్యం మొల్ల రామాయణమన్నారు. అందులోని గద్యపద్యాలలోని భాషా సాహిత్య సౌరభాన్ని ఆఘ్రాణిస్తే దేశీ పదసంపదకు సంస్కృత పాటవాన్ని మేళవించిన విషయం అర్థమవుతుందని వివరించారు. మొల్ల రామాయణంలోని సమాజ చిత్రణ చాలా వరకు తెలుగు లోగిళ్లలోని సహజ స్థితిని తెలియ చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఏపీ శాలివాహన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఐలాపురం భాస్కర శ్రీనివాస్, సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ ఐలాపురం రాజా, శాలివాహన సంఘం జిల్లా అధ్యక్షులు బొమ్మిన శ్రీనివాసరావు, నగర అధ్యక్షులు భర్తవరపు దుర్గాప్రసాద్, ఏపీ కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ పేరేపి ఈశ్వర్, విగ్రహ దాత పి.కరుణాకర్ వడయార్, బాడిశ రూపేష్, బాడిశ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

కుండపోత వర్షం!

బెజవాడలో ఆదివారం రాత్రి కుండపోతగా వర్షం కురిసింది. సాయంత్రం నుంచి వాతావరణం చల్లబడి ఆకాశం మేఘావృతమైంది. సాయంత్రం ఏడు గంటల సమయం నుంచి ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. వానతో నగరంలో పలువురు అసౌకర్యానికి గురయ్యారు. కొన్ని ప్రాంతాల్లో మోకాలి లోతులో నీళ్లు నిలిచాయి.
–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ









విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ



భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరానికి చెందిన మార్వాడీ సమ్మేళన్ స్వచ్ఛంద సేవా సంస్థ వివిధ పాఠశాలల విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను వితరణ చేసింది. వన్‌టౌన్ సామారంగం చౌక్‌లోని మార్వాడీ కమిటీ హాల్‌లో ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలు పాఠశాలల్లో మంచి మార్కులతో చదువుకుంటున్న విద్యార్థులకు ఫీజుల నిమిత్తం నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. అందులో భాగంగా గొల్లపూడిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్యా అకాడమి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో ఒకటి నుంచి 10వ తరగతి వరకు చదువుకుంటున్న 10 మంది విద్యార్థులకు తరగతుల వారీగా సుమారు రూ.60 వేలు నగదు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మార్వాడీ సమ్మేళన్ కమిటీ సభ్యులు, శ్యామ్ మార్కెటింగ్ అధినేత ఓంప్రకాష్‌జీ మాట్లాడారు.

కొండపై భక్తజన సందడి



ఆలయంలో లోపల భక్తుల రద్దీ

ఆషాఢ మాసం ఆఖరి ఆదివారం కావడంతో ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధి వేలాది మంది భక్తులతో సందడిగా మారింది. దుర్గమ్మ దర్శనం కోసం వచ్చిన భక్తులతో క్యూలైన్లు కిటకిటలాడాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్త బృందాలు ఎంతో భక్తిశ్రద్ధలతో అమ్మవారికి ఆషాఢ సారె సమర్పించాయి. తమిళనాడు, కర్ణాటక, ఒరిస్సాల నుంచి సైతం భక్తులు తరలివచ్చి అమ్మవారికి సారె సమర్పించారు.
–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు



ఆలయం ఎదుట సారె తెచ్చిన భక్త బృందాల సభ్యులు



అమ్మవారికి సారె తీసుకెళుతున్న భక్తులు

జగన్మాతకు ఆషాఢ సారె



అమ్మవారికి సమర్పించేందుకు సారెతో సిద్ధమైన మహిళలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆషాఢ మాసోత్సవంలో భాగంగా ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న జగన్మాత కనకదుర్గమ్మకు ఆదివారం విద్యాధరపురం కామకోటినగర్‌కు చెందిన హరి వాణి భక్త బృందం ఆధ్వర్యంలో ఆషాఢ సారె సమర్పించారు. తొలుత దుర్గమ్మకు పదహారు ఉపచారాలతో కూడిన షోడశోపచార పూజలు నిర్వహించారు. అనంతరం మేళతాళాల నడుమ జరిగిన అమ్మవారి గ్రామోత్సవంలో ప్రతి ఇంటి వద్ద భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో నీరాజనాలు సమర్పించారు. ఆ తరువాత మహిళలు చీర, సారె, ఇతర మంగళ ద్రవ్యాలతో ఇంద్రకీలాద్రికి చేరుకుని సారె సమర్పించారు. భక్త బృందం నిర్వాహకురాలు హరి వాణి మాట్లాడుతూ ఆనవాయితీగా ఈ ఏడాది కూడా అమ్మవారికి సారె సమర్పించామని తెలిపారు. మన ఇంటి ఆడపడుచుకు సారె ఎలా ఇస్తామో, అదే విధంగా అమ్మవారిని మా ఇంటి ఆడబిడ్డగా భావించి సారె అందజేస్తున్నామని పేర్కొన్నారు. జగన్మాత కరుణాకటాక్షాలు అందరిపై ఉండాలని, కార్యక్రమంలో హేమాద్రి అరుణ, తంగిరాల అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

● **పటమట(విజయవాడతూర్పు):** ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదులు-పరిష్కార కార్యక్రమం వీఎంసీ ప్రధాన కార్యాలయంతోపాటు నగరంలోని మూడు సర్కిళ్లలోనూ నిర్వహిస్తున్నామని కమిషనర్ ధ్యానచంద్ర ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. చిట్టినగర్‌లోని సర్కిల్-1 , సత్యనారాయణపురంలోని సర్కిల్-2,పటమటలోని సర్కిల్-3 కార్యాలయంలో వినతులు స్వీకరిస్తామన్నారు.